# డైలాగ్ రైటర్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

ప్రియతమ్ పేరు చెప్తే చాలు అతను చక్కటి నవలలు రాసే రచయితగా తెలుగు పాఠకులంతా గుర్తుపట్టగలరు. వంద నవలలు దాకా రాసిన ప్రియతమ్ రాసిన సీరియల్స్ చదవడానికి పాఠకులంతా ఆసక్తి చూపిస్తారు.

అలాంటి ప్రియతమ్ నవలలు కొన్ని సినిమా నిర్మాతల దృష్టిలో పడ్డాయి. ఓ నవలని సినిమాగా తీయడానికి వుత్సాహం చూపించిన నిర్మాత అతన్ని మద్రాస్ పిలిపించాడు.

ప్రియతమ్‌కి సినిమాలకి సంభాషణలు రాయాలనే కోరిక చాలా కాలంగా వుంది. తన సబ్జెక్ట్‌కి తనే సంభాషణలు రాసే పక్షంలో ఆ నవల సినిమా రైట్స్ ఇస్తాననే కండీషన్ పెట్టాడు. అతనిచేత తనకి కావలసిన సంభాషణలు రాయించుకోగలననే నమ్మకం, అతని నవలల్లో చాలా భాగం చదివిన దర్శకుడికి ఏర్పడింది. ఫలితంగా ప్రియతమ్ సినిమాగా వస్తున్న తన తొలి నవలకి తనే సంభాషణ రచయితగా మారాడు.

నవలని సినిమా కోసం మార్చే చర్చల్లో ప్రియతమ్ కూడా పాల్గొన్నాడు. వారం, పది రోజుల్లో ఆ పని పూర్తయి సీనిక్ ఆర్డర్, అంటే తెరమీద ఆ కథ ఎన్ని దృశ్యాలుగా ఏ క్రమంలో కనబడుతుందో ఫైనలైజ్ అయింది.

ప్రియతమ్ మరో వారం రోజుల్లో సీనిక్ ఆర్డర్ ప్రకారం అన్ని దృశ్యాలకి సంభాషణలు రాశాడు. చలన చిత్రానికి సంభాషణలు రాసేవాళ్ళు గుర్తుంచుకోవలసిన ముఖ్యమయిన విషయం డైలాగ్ కంటే దృశ్యపరంగా కథని ఎలా చెప్పగలగడం అన్న సిద్ధాంతం దృష్టిలో వుంచుకుని డైలాగ్స్ రాశాడు ప్రియతమ్.

దర్శకుడు స్క్రిప్ట్‌ని మొత్తం చదివి తనకి తోచిన మార్పులు, చేర్పులు సూచించాడు. ఓ దృశ్యంలో సంభాషణలు తక్కువయితే తక్కువయ్యాయని, ఎక్కువయితే ఆ సంగతి చెప్పాడు. మరో మూడు రోజులు ప్రియతమ్, దర్శకుడు స్క్రిప్ట్ గురించి చర్చించుకుని డైలాగ్స్ వర్షన్‌ని ఓకే అనుకున్నారు.

షూటింగ్ మొదలయింది. తన కథ, తన డైలాగ్స్ వున్న ఆ షూటింగ్‌కి ఎంతో వుత్సాహంగా హాజరయ్యాడు ప్రియతమ్.

అది సినిమాలో అతి ముఖ్యమైన సీన్. మొదటి రాత్రి. హీరో హీరోయిన్స్ వివాహం అయ్యాక శోభనం గదిలో వాళ్ళిద్దరి మధ్య సంభాషణ. హీరోయిన్ ఇది వరకే ఎవరికో మనసిచ్చేసింది. ఆమెకి ఇష్టం లేకపోయినా వివాహం జరిగింది. హీరోకి ఆమె మనసులో ఏం వుందో తెలియదు కాబట్టి ఆతృతగా ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు.

సినిమా మొత్తానికి, ఆ సీన్‌లోని డైలాగ్స్ తను బాగారాసాడనే నమ్మకంతో వున్నాడు ప్రియతమ్. వాటిని నటీనటులు ఎలా పలుకుతారా అని ఆసక్తిగా చూసాడు.

హీరోయిన్: తలుపులు మూసివున్న ఈ గదిలో మన మనస్సులు తెరచుకోవాల్సిన సమయం ఆసన్నమయింది రఘు.

హీరో: నిజమే. తలుపులు మూసేసిన ఈ గదిలోకి వెన్నెల ఎలా పడుతోందో చూశావా? అలాగే నీవు నా



జీవితంలోకి కాంతిరేఖలా ప్రవేశించావు సుశీ.

హీరోయిన్: వెన్నెలని ప్రసరించే ఆ చంద్రుడికి కూడా మచ్చవుంటుంది. అలాగే నాకు...

హీరో: కబుర్లతో కాలక్షేపం రేపు చేదాం. దగ్గరకి రా. తలుపులు మూసుకున్నా తలపులు మూసుకోవుగా. రా.

షాట్‌కి ముందు హీరోయిన్‌కి డైలాగ్స్ చెప్పాడు అసిస్టెంట్ డైరెక్టర్.

"అసలు విషయం ఏమిటి?" అర్థంకాక అడిగింది హీరోయిన్.

ప్రియతమ్ భావగర్భంగా రాసిన ఆ డైలాగ్స్ వెనుక భావం వివరించాడు డైరెక్టర్.

"ఇది చాలా పాతస్కూల్. ఇలా బీట్ ఎరౌండ్ ది బుష్ దేనికి. సూటిగా విషయానికి వచ్చేయచ్చుగా" పెదవి విరిచింది హీరోయిన్.

"నిజమే అనుకోండి. కాని ఇది సూటిగా చెప్పే విషయం కాదు. సున్నితంగా చెప్పాలి".

"ఏ క్లాస్‌కి, కొంతలో కొంత బి క్లాస్ ఆడియన్స్‌కి అర్థం అవుతుంది కాని సి క్లాస్ ప్రేక్షకులకి అర్థం కాదు ఈ మాటల గారడి. మొన్న బెస్ట్ డైరెక్టర్‌గా ఫిలింఫేర్ అవార్డ్ వచ్చిన కళ్యాణ్‌రావ్ సినిమాలలో దేంట్లో ఇలా వుందవు డైలాగ్స్. 'నన్ను క్షమించు రఘు. నా మనసు ఎవరికో ఇచ్చేసాను. ఇది బలవంతపు పెళ్ళి' అంటే ఇంత సొద, ఇంత ఫుటేజ్ తప్పుతాయి కదా?"

వంద సినిమాల్లో నటించిన ఆ గ్లామరస్ హీరోయిన్ మాటని కాదనలేకు ఆ దర్శకుడు. మరో రెండు సార్లు చెప్పి చూసాడు కాని ఆమె పట్టుపట్టడంతో ప్రియతమ్ రాసింది కొట్టేసి, ఆ స్థానంలో ఆమె చెప్పింది రాసాడు.

'తలుపులు మూసుకున్నా తలపులు మూసుకోవుగా' అన్న డైలాగ్‌ని కరెక్ట్‌గా చెప్పలేకపోయాడు హీరో. తలుపులు చోట తలపులు లేదా తలపులు చోట తలుపులు పలికాడు. ఏదో టేక్‌లో "డైలాగ్ బాలేదు, మార్చండి" చెప్పాడు. విసిగిపోయిన కెమేరామెన్ డైలాగ్ ఎలా వుంటే బావుంటుందో అందించాడు. "బ్యూటీఫుల్. ఫెంటాస్టిక్. ఇలాగే అంటాను' చెప్పాడు హీరో.

రచయిత తన మేధస్సునంతా రంగరించి, ప్రేక్షకులకి ఎలా చెబితే అందంగా వుంటుందో దృష్టిలో పెట్టుకొని రాసిన డైలాగ్స్‌ని, వాటిని పలకలేనివారు, అందులోని అందాన్ని గ్రహించలేనివారు సెట్లో వాటిని ఎలా పోస్ట్‌మార్టం చేసి మార్చేస్తారో గ్రహించిన ప్రియతమ్ నాలుగు రోజుల తర్వాత మద్రాస్ నించి తన వూరు వెళ్ళిపోయాడు.

ఇప్పుడు ప్రియతమ్ నవలలు చాలా సినిమాలుగా వస్తున్నా "సంభాషణలు కూడా మీరే రాయండి" అని ఏ దర్శకుడు అడిగినా చిరునవ్వుతో "సారీ. నాకు కుదరదు" అంటాడ